క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పహాడీషరీఫ్: గౌస్‌నగర్ విద్యుత్ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా పలు బస్తీలలో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పహాడీషరీఫ్ ఏఈ ఎల్.వీ.సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. గౌస్‌నగర్, హుస్సేన్‌నగర్, ఈడబ్ల్యూఎస్‌కాలనీ, సాదత్‌నగర్, అహ్మద్‌నగర్, ఇస్మాయిల్‌నగర్‌లలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. నూరీనగర్ ఫీడర్ పరిధిలోని నూరీనగర్, అల్‌నూరీనగర్, సోనిగ్రూప్ ప్రాంతాలలో మధ్యాహ్నం 2.30 నుంచి 5 గంటల వరకు అంతరాయం కలగడాన్ని గుర్తించి వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

మీర్‌పేటలో..

మీర్‌పేట: మరమ్మతుల కారణంగా బుధవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని మీర్‌పేట ఏఈ బాలాగౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ నందిహిల్స్ ఫీడర్ పరిధిలోని టీచర్స్‌కాలనీ, నాగార్జునహిల్స్, కేఆర్‌ఆర్ హిల్స్, చైతన్య హిల్స్, నందిహిల్స్‌లో ఉదయం 10 నుంచి 11 గంటల వరకు. 11కేవీ డీఎల్‌ఆర్‌ఎల్ ఫీడర్ పరిధిలోని టీఎస్‌ఆర్‌నగర్, ప్రశాంతిహిల్స్ ఫేజ్-1,2, రాఘవేంద్రనగర్, మీర్‌పేట పోస్టాఫీసు, మీర్‌పేట పోలీస్‌స్టేషన్, సీతాహోమ్స్‌లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

రోడ్లకు మరమ్మతులు



గుంతలను పూడ్చివేయిస్తున్న స్థానికులు

పహాడీషరీఫ్: మున్సిపాలిటీలోని సబితా ఇంద్రారెడ్డి కాలనీలో అధ్వానంగా మారిన రహదారులపై అధికారులు మంగళవారం మొరం పోసి మరమ్మతులు చేపట్టారు. గుంతలమయమైన రహదారులతో రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నామని, బోనాలు సమీపిస్తున్నందున ముత్యాలమ్మ ఆలయానికి వెళ్లలేని పరిస్థితి నెలకొన్న విషయమై స్థానికులు గతంలో కమిషనర్ వెంకట్రామ్ దృష్టికి తీసుకొచ్చారు. దీనికి స్పందించిన ఆయన మంగళవారం టిప్పర్ల ద్వారా గోతులలో మొరం పోయించి పూడ్చివేయించారు. ఈ సందర్భంగా స్థానికులు కమిషనర్‌కు ధన్యవాదాలు తెలియజేశారు.

చెట్లకొమ్మలను వెంటనే తొలగించాలి

హుడాకాంప్లెక్స్: విద్యుత్ బిల్లు కట్టకపోతే డిపార్ట్‌మెంట్ వాళ్లు ఏ నోటీసు లేకుండానే కనెక్షన్ కట్ చేస్తారు కదా.. ఉద్యోగులు తమ బాధ్యతలు సక్రమంగా నిర్వహించకపోతే ఎలా అని సరూర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి ప్రశ్నించారు. మంగళవారం డివిజన్ పరిధి వెంకటేశ్వరకాలనీ రోడ్ నం-6లో ఆమె పర్యటించారు. సిబ్బంది కట్ చేసిన చెట్లకొమ్మలు రోడ్లకిరువైపులా పడేశారు. కాలనీవాసులు ఎన్నిసార్లు తొలగించాలని విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు కార్పొరేటర్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన కార్పొరేటర్.. సంబంధిత అధికారుల దృష్టికి వారం క్రితమే తీసుకొచ్చారు. వారం గడిచినా తొలగించకపోవడంతో ఉన్నతాధికారులకు ఆమె ఫోన్ చేశారు. బిల్లులు సకాలంలో చెల్లించడం లేదని విద్యుత్ కనెక్షన్‌లను తొలగిస్తారు.. అలాగే మీరు కూడా అదే చిత్తశుద్ధితో మీ బాధ్యతలు, పనులు సరిగా చేయకపోతే జీతాలు తీసుకోవద్దని ఆగ్రహం వ్యక్తం చేశారు. 24 గంటల్లో సరూర్‌నగర్ డివిజన్ మొత్తం ఉన్న చెట్ల కొమ్మలను తొలగించాలన్నారు. రోడ్ల వెంట చెత్త నిలువ ఉండడంతో పాములు, పురుగులు, దోమలు వృద్ధి చెందుతున్నాయని వెంటనే తొలగించాలని ఆదేశించారు.

ఘనంగా తొట్టెల ఊరేగింపు



తొట్టెల ఊరేగింపులో పాల్గొన్న నాయకులు

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీలోని శ్రీరామకాలనీలో ఆషాఢ మాసం బోనాల ఉత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి తొట్టెల ఊరేగింపు కనుల పండువగా జరిగింది. డప్పు వాయిద్యాలు, పోతురాజుల విన్యాసాలు, యువకుల కేరింతల మధ్య ఊరేగింపు ఘనంగా కొనసాగింది. అనంతరం పోచమ్మ అమ్మవారికి తొట్టెల కట్టి పూజలు చేశారు. కార్యక్రమంలో కాలనీ జేఏసీ చైర్మన్ ఎం.వివేకానందగౌడ్, మాజీ కౌన్సిలర్లు ఎనగండ్ల శ్రీధర్‌గౌడ్, లక్ష్మీనారాయణ, పల్లపు శంకర్, నాయకులు షేక్ జహంగీరుద్దీన్, టి.మనోజ్, సంతోష్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

లింకురోడ్లకు మోక్షం ఎప్పుడో?

- అసౌకర్యమైన దారులు.. వాహనాల రాకపోకలకు ఇక్కట్లు
- అధ్వాన రోడ్లతో ఇబ్బంది పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



కందుకూరు- పాత శ్రీశైలం రోడ్డు

కందుకూరు: గ్రామాల అభివృద్ధి లింకు రోడ్లతో ముడిపడి ఉంటుంది. అవి అభివృద్ధి చెందితే ఆ ప్రాంతాలకు రవాణా సదుపాయం మెరుగు అవడంతో పాటు.. స్థానికులకు సౌకర్యవంతంగా ఉంటుంది. అంతే కాకుండా ఈ రోడ్లగుండా ప్రయాణం .. అనేక గ్రామాలు, పట్టణాలకు దూరభారం తగ్గుతుంది. కానీ వాటి గురించి పట్టించుకునే వారు లేరని కందుకూరు మండల పరిధి గ్రామాల రైతులు, ప్రజలు ఆరోపిస్తున్నారు. ఏళ్లుగా సమస్య వేధిస్తున్నా.. ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. మట్టిరోడ్లు అందులో గుంతలమయం, ఇరుకుగా ఉండటంతో పాటు.. ఇరువైపులా ఏపుగా పెరిగిన ముళ్లపొదలతో రాకపోకలు సాగించడం కష్టంగా మారింది. ఇందుకు కందుకూరు నుంచి గూడూరు, మాలగూడూరు, అన్నోజిగూడ గ్రామాలకు ఫార్మా రహదారిని కలిపే లింకు రోడ్లే నిదర్శనం.

అభివృద్ధి చేస్తే.. నేరుగా ఫార్మాసిటీకి

కందుకూరు మండల కేంద్రం నుంచి గూడూరు గ్రామం దాని అనుబంధ గ్రామం మాలగూడూరు, మరో గ్రామం కటికపల్లి, అన్నోజిగూడకు నేరుగా వెళ్లేలా ఉన్న లింకు రహదారులు అభివృద్ధికి నోచుకోవడం లేదు. తూర్పున ఉన్న గూడూరు, అన్నోజిగూడ, పడమర వైపు ఉన్న కందుకూరు గ్రామాల మధ్య నుంచి ఫార్మా రహదారి సైతం నిర్మించారు. అక్కడి నుంచి మూడు వైపులా ఉన్న లింకు రోడ్లను అభివృద్ధి చేస్తే.. మండల కేంద్రానికి ఆయా గ్రామాల వైపు నుంచి రాకపోకలు సాగించడానికి వీలవుతుంది. చుట్టూ తిరిగిరావాల్సిన అవసరం ఉండదు. నేరుగా ఫార్మాసిటీ రహదారికి చేరుకోవచ్చు.

ప్రయాణం నరకప్రాయం

గూడూరు నుంచి కందుకూరు మధ్య ఉన్న లింకు రోడ్డు సుమారు నాలుగు కిలో మీటర్ల దూరం ఉంటుంది. మాలగూడూరు నుంచి కందుకూరుకు మూడు, మూడున్నర కిలో మీటర్లు. ఆ రహదారులతో పాటు పాత శ్రీశైలం రహదారి ప్రస్తుతం ఫార్మా రహదారి నుంచి కందుకూరుకు మరో రెండు కిలో మీటర్లు ఉంటుంది. అన్నోజిగూడ నుంచి కందుకూరు వరకు దాదాపు మూడు కిలో మీటర్లు. ప్రస్తుతం ఆ రహదారులు గుంతలమయంగా మారాయి. ఇరువైపులా ఏపుగా పెరిగిన కంప చెట్లతో దర్శనమిస్తున్నాయి. అసలే మట్టిరోడ్లు.. ఆపై వర్షం వస్తే అంతా బురదమయమే. దీంతో ప్రయాణం నరకప్రాయం అవుతుందని ప్రాంత ప్రజలు పేర్కొంటున్నారు. ఆ లింకు రహదారులను అభివృద్ధి చేస్తే.. గూడూరు, కటికపల్లి గ్రామాలతో పాటు పైనున్న రాచులూరు, లేమూరు, తిమ్మాపూర్, బేగంపేట, అగర్మియాగూడ, సరస్వతిగూడ, గుమ్మడవెల్లి గ్రామాల వైపు నుంచి వచ్చే వారికి మండల కేంద్రానికి దగ్గర దారి అవుతుంది. ఇప్పటికైనా అధికారులు, పాలకులు దృష్టిసారించి ఆయా లింకు రోడ్లను అభివృద్ధి పరచాలని ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపించాం



కందుకూరు నుంచి గూడూరు వెళ్లే రోడ్డు నాలుగున్నర కిలోమీటర్లకు, కందుకూరు నుంచి అన్నోజిగూడకు వెళ్లే మూడు కిలో మీటర్ల రోడ్డు అభివృద్ధికి నిధుల మంజూరు కోసం ప్రతిపాదనలు పంపించాము. నిధులు మంజూరు కాగానే.. పనులు చేపట్టవచ్చు. మిగతా రోడ్లకు ఎలాంటి వినతులు రాలేదు.

– సతీష్‌రెడ్డి, ఏఈ పీఆర్, కందుకూరు

కాంగ్రెస్ ఐటీ సెల్ కో-ఆర్డినేటర్‌గా రవీందర్



రవీందర్‌కు నియామకపత్రం అందిస్తున్న కేఎల్లార్

బడంగ్‌పేట్: మున్సిపాలిటీకి చెందిన చిన్నరావుల రవీందర్‌కుమార్ కాంగ్రెస్ పార్టీ ఐటీ సెల్ కో- ఆర్డినేటర్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్ చేతుల మీదుగా రవీందర్ నియామకపత్రం అందుకున్నారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని, నియామకానికి పూర్తి సహకారం అందించిన పార్టీ పెద్దలు, నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పెద్దబావి సుదర్శన్‌రెడ్డి, రాళ్లగూడెం శ్రీనివాస్‌రెడ్డి, పార్టీ కార్పొరేషన్ ఎస్సీ చైర్మన్ బోయపల్లి కుమార్, గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ బోయపల్లి గోవర్ధన్‌రెడ్డి, సూర్యగంటి విజయ్‌కుమార్, నాయకులు తదితరులు ఉన్నారు.

సూర్యగిరి ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేకాలంకరణలో అమ్మవారు

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల శ్రీ సూర్యగిరి ఎల్లమ్మకు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచే అమ్మవారి దర్శనం కోసం భక్తులు క్యూలో ఉన్నారు. అమ్మవారికి ప్రత్యేకాలంకరణ చేశారు. భక్తులు నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో సామూహిక శ్రీ సత్యనారాయణస్వామి వ్రతాలు చేశారు. నాగదేవతకు పుట్టలో పాలు పోసి పూజలు చేశారు. అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రెడ్డిగళ్ల రత్నం, ఈఓ మోహన్‌రావు, సిబ్బంది మీగడ కాశీనాథ్, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

అపరిశుభ్రం.. వసతిగృహం



తుక్కుగూడ బీసీ బాలుర వసతి గృహంలో నిలిచిన మురుగు నీరు

తుక్కుగూడ: మున్సిపల్ పరిధిలోని మహేశ్వరం గేటు మహాత్మా జ్యోతిబాపూలే బాలుర బీసీ వసతి గృహం పూర్తిగా అపరిశుభ్రంగా మారింది. ఎక్కడ చూసినా మురుగు నీరు, చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. ముఖ్యంగా మరుగుదొడ్ల నిర్వహణ సరిగా లేక దుర్వాసన వస్తుండడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని పలువురు తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. స్నానాలు చేసే ప్రదేశంలో కూడా పూర్తిగా మురుగు నీరు చేరింది. దీంతో దోమలు, ఈగల సంఖ్య పెరిగి విద్యార్థులు అనారోగ్యానికి గురవుతున్నారని, నిర్వాహకులు పాఠశాలలో పరిశుభ్రతపై దృష్టి సారించాలని కోరుతున్నారు.

కొత్త ఓటర్లను నమోదు చేయించాలి

తహసీల్దార్ ఇందిరాదేవి



బూత్ లెవల్ అధికారుల శిక్షణలో పాల్గొన్న తహసీల్దార్ ఇందిరాదేవి

బడంగ్‌పేట్: బూత్ లెవల్ అధికారులు అప్రమత్తంగా ఉండి కొత్త ఓటర్లను నమోదు చేయించాలని బాలాపూర్ మండల తహసీల్దార్ ఇందిరాదేవి సూచించారు. మంగళవారం బడంగ్‌పేటలోని బాలాపూర్ మండల కార్యాలయంలో బీఎల్‌ఓలకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ.. ఎలక్షన్ కమిషన్ చట్టాలను అమలు చేసేలా బూత్ లెవల్ అధికారులు చూడాలని కోరారు. కొత్తగా ఓటరు నమోదు కార్యక్రమం నుంచి ఎన్నికలు ముగిసేంతవరకు బీఎల్‌వోలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మండల కార్యాలయం నుంచి పూర్తి సహకారం అందిస్తామని వెల్లడించారు. ఓటర్లకు అనుసంధాన కర్తలుగా బీఎల్‌వోలు ఉండాలన్నారు. అనంతరం ఎలక్షన్ కమిషన్ చట్టాలు, నియమాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నయాబ్ తహసీల్దార్ మణిపాల్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

కుర్మ సంఘం మండల అధ్యక్షుడిగా పాండు



నూతన సంఘం అధ్యక్షుడిని సన్మానిస్తున్న నాయకులు

కందుకూరు: కురుమ సంఘం మండల నూతన అధ్యక్షుడిగా ఆకులమైలారంకు చెందిన అచ్చన పాండుకురుమ, ప్రధాన కార్యదర్శిగా ముచ్చర్లకు చెందిన సిద్దాల శ్రీనివాస్‌కురుమను ఎన్నుకున్నారు. మంగళవారం కురుమ సంఘం నాయకులు సమావేశమై వారిని ఎన్నుకొని ప్రకటించారు. మిగతా పూర్తి కమిటీని త్వరలో ఎన్నుకుంటామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా పాండు మాట్లాడుతూ.. కురుమల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకం ఉంచి పదవి రావడానికి కారణమైన వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మండల గౌరవాధ్యక్షుడు ఎగ్గిడి సత్తయ్య, సంఘం నాయకులు బండ ఆంజనేయులు, ఎగ్గిడి చిన్న ఐలయ్య, బక్క మల్లేశ్, గౌర ప్రభాకర్, బండ నర్సింహా, సరికొండ జగన్, ఎగ్గిడి కృష్ణ, ఏకుల మహేందర్, మోటే జంగయ్య, ఎమ్మిడి జంగయ్య, దొడ్డి కృష్ణ, ఏకుల మల్లేష్, దేవయ్య, మోటే రమేష్, శేఖర్, నర్సింహా, కుమార్, శ్రీరామ్, జగదీష్, సత్యం, కృష్ణ పాల్గొన్నారు.

వైభవంగా ఫలహార బండ్ల ఊరేగింపు



ఉద్దంగడ్డలో పట్లోళ్ల కార్తీక్‌రెడ్డిని సన్మానిస్తున్న నిర్వాహకులు

మైలార్‌దేవ్‌పల్లి: డివిజన్ పరిధిలోని వివిధ బస్తీల్లో ఘట్టాలు, తొట్టెలతో పాటు ఉద్దంగడ్డ హనుమాన్ ఆలయ పరిధిలో నిర్వాహకులు ఫలహార బండి ఊరేగింపు నిర్వహించారు. పోతురాజుల విన్యాసాలు, బ్యాండు వాయిద్యాల నడుమ యువకుల కేరింతలు కొడుతూ ఊరేగింపులో పాల్గొన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఇన్‌చార్జి పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి పాల్గొనగా నిర్వాహకులు ఆయనకు స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. బీఆర్‌ఎస్‌తో పాటు వివిధ పార్టీలకు చెందిన నాయకులు కూడా హాజరయ్యారు. కార్యక్రమంలో మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు ఎస్.వెంకటేశ్, సీనియర్ నాయకులు రాముయాదవ్, రాఘవేందర్, గుమ్మడి కుమార్, మైసిరెడ్డి, జి.రాజు, ప్రవీణ్, ఈశ్వర్, జగదీశ్, సురేశ్, భూదేవి, సరిత, సునీల్, ఏ.మహేశ్, అశోక్‌కుమార్, జగన్ ముదిరాజ్ , లడ్డూయాదవ్, శివయాదవ్, ఎస్.రాజేశ్‌యాదవ్, సందీప్, వరుణ్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

బదిలీలతో కూడిన ప్రమోషన్లు చేపట్టాలి



సభ్యత్వ నమోదులో ఎస్‌టీయూటీఎస్ నాయకులు

అత్తాపూర్: ఉపాధ్యాయులకు బదిలీలతో కూడిన ప్రమోషన్లు కల్పించాలని ఎస్‌టీయూటీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సదానందంగౌడ్ అన్నారు. రాజేంద్రనగర్ మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఎస్‌టీయూ సభ్యత్వ నమోదును మంగళవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..బదిలీలు చేయకుండా పదోన్నతులు కల్పిస్తే సీనియర్ ఉపాధ్యాయులు నష్టపోతారన్నారు. అలాగే ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని, 2008 డీఎస్సీ నుంచి ఇటీవల నియమితులైన ఉపాధ్యాయులకు 6 నెలలుగా వేతనాలు లేనందున వెంటనే చెల్లించాలని కోరారు. కేజీబీవీ సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉపాధ్యాయులు, ఉద్యోగులకు పే స్కేల్ ఇవ్వాలని ఆరోగ్య కార్డులు మంజూరు చేయాలని, 2003 డీఎస్సీ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని మంజూరు చేయాలని విన్నవించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, అదనపు ప్రధాన కార్యదర్శి సుధాకర్, ఏఐఎస్‌టీఎఫ్ ఉపాధ్యక్షుడు పరమేశ, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కామిశెట్టి వెంకటయ్య, ఆంజనేయులు, నాయకులు సలోమి, స్నేహలత, సుష్మ, మాధవి, వాణి, వాణిశ్రీ, నాగమణి, మహేశ్వరి, జ్యోతి పాల్గొన్నారు.

కళలను ప్రోత్సహించడం గర్వకారణం

బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి



నాటక ప్రదర్శన చేస్తున్న కళాకారులు

మహేశ్వరం: గ్రామాల్లో అంతరించిపోతున్న రంగస్థల నాటకాలు, పౌరాణిక నాటకాలకు జీవం పోసే విధంగా కళాకారులు కృషి చేయడం అభినందనీయమని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి పేర్కొన్నారు. సోమవారం రాత్రి మండల పరిధి అమీర్‌పేట్‌లో కళాకారులు ద్రౌపది వస్త్రాభరణం, రామాంజనేయ యుద్ధం పౌరాణిక నాటకాలను పద్య రూపంలో ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన నాటకాలను తిలకించి మాట్లాడారు. ఈ రోజుల్లో కనుమరుగవుతున్న కళలు, పౌరాణిక నాటకాలను మళ్లీ ప్రోత్సహించేందుకు అమీర్‌పేట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థులు పౌరాణిక నాటకాలు ప్రదర్శించడం అభినందనీయమన్నారు. గతంలో గ్రామాల్లో ఉన్న ఒకే ఒక ఆటవిడుపు నాటక ప్రదర్శన, ప్రస్తుతం టీవీలు, మొబైల్స్ వచ్చాక వాటి ప్రాముఖ్యత నానాటికి తగ్గిందన్నారు. గ్రామంలో కొంతమంది కళాకారులు కళలనే ప్రాణంగా భావిస్తూ ఆ రంగాన్ని బతికించాని కృషి చేస్తున్నారన్నారు. నేటి యువత కళలపై మక్కు పెంచుకోవాలని ఆయన సూచించారు. కళలను బతికించాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందన్నారు. నాటకాలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, అమీర్‌పేట్ గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు, వివిధ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

రెడ్డి జాగృతి ఆధ్వర్యంలో నల్లపోచమ్మకు బోనాలు

మైలార్‌దేవ్‌పల్లి: రెడ్డి జాగృతి ఆధ్వర్యంలో అలియాబాద్ మహిళా విభాగం సౌజన్యంతో నల్ల పోచమ్మ బోనాల జాతర ఉత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహవీర్ కళాశాల చైర్మన్ జయలక్ష్మి, రాష్ట్ర మహిళా రెడ్డి సెక్రటరీ అగ్నిహోత్రి మహవీర్ గ్రూప్ విద్యా సంస్థల బోనాలను అమ్మవారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

బండ్లగూడ: పరిసరాలు శుభ్రంగా ఉంచుకుంటే రోగాలు దరిచేరవని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర సూచించారు. '100 రోజుల ప్రణాళిక ఒక మార్పు అభివృద్ధికి మలుపు' కార్యక్రమంలో భాగంగా కార్పొరేషన్ పరిధిలోని 14వ డివిజన్ సంజయ్‌గాంధీనగర్ కాలనీలో తడి, పొడి, హానికర చెత్తపై కాలనీ ప్రజలకు మంగళవారం అవగాహన కల్పించారు. అలాగే అండర్ గ్రౌండ్ డ్రైనేజీ క్లీనింగ్ ప్రక్రియను పరిశీలించి పలు సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈఈ జి.యాదయ్య, ఏఈఈ వి.రాజ్‌కుమార్, జి.వెంకట్‌రెడ్డి, వార్డు ఆఫీసర్ వసీఆలీ, బిల్ కలెక్టర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, ఆర్‌పీలు, శానిటరీ జవాన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు రుణాల పంపిణీ



రుణాలు పంపిణీ చేస్తున్న చైర్మన్ సతీశ్

శంషాబాద్ రూరల్: మండలంలోని మల్కారం సొసైటీ పరిధిలోని రైతులకు మంగళవారం రుణాలు పంపిణీ చేశారు. రూ. 1.35 లక్షలు దీర్ఘకాలిక రుణాలు, రూ.49.80 లక్షల పంట రుణాలను రైతులకు అందించామని సొసైటీ చైర్మన్ బి.సతీశ్ సూచించారు. అలాగే సకాలంలో రుణాలు చెల్లించి సొసైటీ అభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

50శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి

బీసీ హక్కుల సాధన సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి నర్సింహ



డీఆర్‌ఓ సంగీతకు వినతిపత్రం అందజేస్తున్న బీసీ హక్కుల సాధన సమితి నాయకులు

మహేశ్వరం: ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని బీసీ హక్కుల సాధన సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లాటి యాదయ్య డిమాండ్ చేశారు. మంగళవారం బీసీ హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఆయన డీఆర్‌ఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీల సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలన్నారు. కులగణన చేపట్టి జనాభా నిష్పత్తి ప్రకారం బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలన్నారు. బీసీలకు కేంద్ర కేబినెట్ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసి రూ.20 లక్షల కోట్ల బడ్జెట్‌ను కేటాయించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అవాజ్‌యోజన కింద ఎస్సీ, బీసీ, ఎస్టీ కుటుంబాలకు ఇళ్లు నిర్మించుకోవడానికి రూ.10 లక్షలు మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. విద్యాహక్కు చట్టం ప్రకారం బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు నాణ్యమైన ఉచిత విద్యను అందించాలని కోరారు. అనంతరం పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని డీఆర్‌ఓకు అందజేశారు. కార్యక్రమంలో బీసీ హక్కుల సాధన సమితి నాయకులు నర్సింహ, రమేశ్, నరేందర్, రాములు, శంకరయ్య, శ్రీను, రామచంద్రయ్య, రేణుక పలువురు పాల్గొన్నారు.

వాలంటరీలో బోనాల సందడి



ఆలయంలో బోనాలతో మహిళా ఉద్యోగులు తదితరులు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్‌లోని వాలంటరీలో మంగళవారం బోనాల సందడి నెలకొన్నది. ఈ సందర్భంగా వాలంటరీ ఉద్యోగులు ప్రధాన గేటు నుంచి ఫలహారపు బండ్లు, తొట్టెలతో బోనాలతో ఊరేగింపుగా తరలివచ్చారు. వాలంటరీ డీజీ ఎం.అనిత, ఎస్ఈ పి.వి.నాగేందర్, ఈఈ రవీంద్రారెడ్డి, ఏఓ నాగేశ్వర రావు పూజలు చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. బోనాలు సమర్పించిన అనంతరం సామూహిక భోజనాలు చేశారు. కార్యక్రమంలో డీఈఈలు ఝాన్సీ, అనితాయాదవ్, డీడీఏ సునీత, శంకర్ ప్రసాద్, రాజుస్వామి, శ్రీశైలం, ముత్యాలు, రాజు గౌడ్, వై.ముత్యాలు, కృష్ణాచారి, పద్మరాజు, శివ కుమార్, శంకర్, నరసింహ, వెంకటేశ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పికిల్‌బాల్‌కు ఆదరణ



గెలుపొందిన క్రీడాకారులు

మణికొండ: దేశంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న పికిల్ బాల్‌కు ఆదరణ పెరుగుతోందని పికిల్ అవుట్ సీఈఓ అపర్ణ రావు అన్నారు. హైదరాబాద్ నగర శివారు కోకాపేటలోని క్రాస్ కోర్ట్ స్పోర్ట్స్ క్లబ్‌లో హైదరాబాద్ పికిల్‌బాల్ ఛాంపియన్ షిప్-2025 పోటీలు మంగళవారం ముగిశాయి. పురుషుల డబుల్స్, సింగిల్స్, మహిళల డబుల్స్, సింగిల్స్ మిక్స్‌డ్ డబుల్స్, 35 ఏళ్ల పైబడిన వారి పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో ఇవే మొదటి పోటీలు అని హైదరాబాద్‌తో పాటు బెంగళూరు, చెన్నై, కోయంబత్తూరు, విశాఖపట్నం పట్టణాల నుంచి అగ్రశ్రేణి క్రీడాకారులు పాల్గొన్నారన్నారు. పురుషుల డబుల్స్‌లో సమీర్, నిఖిల్, సింగిల్స్‌లో రషీన్ శామ్యూల్, మహిళల డబుల్స్‌లో రితిక, జోషిక, సింగిల్స్‌లో రితిక, మిక్స్‌డ్ డబుల్స్‌లో రితిక, అనిష్ రాణించడంతో మెమెంటోలు అందించారు.